గళం విప్పాలి.. పరిష్కారం చూపాలి

ప్రధాన సమస్యలపై అసెంబ్లీలోచర్చించాలని ప్రజల విజ్ఞప్తి


నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో గళం విప్పాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు, దశాబ్దాలుగా ఉన్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపాలని కోరుతున్నారు. వీటిపై ఎమ్మెల్యే గణబాబు అసెంబ్లీ వేదికగా చర్చించి పరిష్కార మార్గం చూపాలని ఆశిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలపై కథనం.



గోపాలపట్నం: తమ ఇళ్లకు శాశ్వత గృహ హక్కు కల్పించాలని మేహాద్రి గెడ్డ నిర్వాసితులతో పాటు కంపరపాలెం, పద్మనాభనగర్, ఎస్సీబీసీ కాలనీ, నందమూరినగర్, జనతా కాలనీ వాసులు 40 ఏళ్లుగా పోరాడుతున్నారు. గత ప్రభుత్వంలో ఈ సమస్యపై సానుకూల స్పందన లభించింది. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా సమస్యను పరిష్కరించాలని అప్పటి కలెక్టర్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో సమస్య కొలిక్కి వస్తుందని అంతా ఆశించారు. అయితే ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ నిలిచి పోయింది.

ఇదీ నేపథ్యం

మేహాద్రి గెడ్డ నిర్మాణానికి పద్మనాభనగర్ వాసులు 1975లో, కంపరపాలెం గ్రామస్తులు 1982లో తమ ఇళ్లు, భూములు ఇచ్చారు. వారికి సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో పద్మనాభనగర్ వాసులకు 76, 76ఏ సర్వే నంబర్లలో 308 పట్టాలు, కంపరపాలెం వాసులకు 70, 71, 73 సర్వే నంబర్లలో 215 ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అదే మాదిరిగా 1985లో గృహ నిర్మాణ సంస్థ వద్ద రుణం పొంది ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. మొత్తంగా 523 మందికి పట్టాలు అందించారు. అలాగే ఎస్సీబీసీ కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఈ పట్టాలు కూడా లబ్ధిదారుల అవసరాలకు ఉపయోగపడని విధంగా ఉన్నాయి. వారసులు బదిలీ చేసుకునేందుకు కూడా వీల్లేదు. దీంతో కుటుంబ అవసరాలకు తనఖా పెట్టు కోవాలన్నా, అమ్ముకోవాలన్నా అవకాశం లేదు.



కంపరపాలెం పద్మనాభనగర్ వ్యూ

పారిశ్రామిక ప్రాంతంలో..

జీవీఎంసీ 58,59,60,61 వార్డుల పరిధిలో పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉండడంతో అభివృద్ధి పనులు పెద్దగా సాగలేదు. కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. హెచ్‌పీసీఎల్ వంటి భారీ పరిశ్రమలు ఉన్నా స్థానికులకు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీటిపై స్థానిక ఎమ్మెల్యే గణబాబు అసెంబ్లీలో ప్రస్తావించాలని విన్నవిస్తున్నారు.

దుర్గాపురంలో దుస్థితి...

జీవీఎంసీ 57వ వార్డు దుర్గాపురంలో ఇళ్ల పట్టాల కోసం చాలాఏళ్లుగా పోరాడుతున్నారు. ఇక్కడ సుమారు 400 కుటుంబాలు నివాసముంటున్నాయి. పోర్టు స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ఇక్కడి వారంతా రోజు కూలీ పనులు చేసుకుని జీవించేవారే. అయితే కొన్నేళ్ల కిందట ఇక్కడి పోర్టు స్థలం నేవీకి లీజ్‌కు ఇవ్వడంతో సమస్య జఠిలంగా మారింది. అయితే గతంలో పలు మార్లు ఉన్నతాధికారులు పర్యటించి పోర్టుకు ప్రత్యామ్నాయ స్థలం ఇచ్చి.. ఇక్కడి వారికి పట్టాలు అందించేందుకు పరిశీలన చేశారు. ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ ప్రభుత్వంలో నైనా తమకు పట్టాలు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.



దుర్గాపురం గ్రామం వ్యూ

ఆఖరి దశలో పట్టాల సమస్య



ఇళ్ల పట్టాల సమస్య 40 ఏళ్ల నుంచి ఉంది. ఎంతో మంది నాయకులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయింది. గత ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా మాకు పట్టాలు వస్తాయని భావించాం. అయితే అధికారులు కొర్రీలు పెట్టడంతో నాయకుల దృష్టికి తీసుకు వెళ్లాం. గత ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ కలెక్టర్ వద్దే ఆగి పోయింది. ఈ ప్రభుత్వంలోనైనా మా ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరించాలి.

– కంపర రామకృష్ణ, కంపరపాలెం

పూర్తి హక్కులు కల్పించాలి



ఇళ్ల పట్టాలు ఎందుకూ పనికిరాని విధంగా ఉన్నాయి. ఏ అవసరానికీ ఉపయోగ పడడంలేదు. దీనిపై మా కుటుంబ సభ్యులకు హక్కులేవు. మాతాతల పేరున ఉన్న పట్టాలు వారసులమైన మా పేరుకు మార్చుకోవాలన్న అవకాశం లేదు. మా ఇళ్లను ప్రభుత్వం తీసుకుని ఇపుడు ఏ హక్కు కల్పించకుండా ఇక్కడ ఇళ్లు ఇచ్చారు. వాటితో భరోసా లేదు. ఈ ప్రభుత్వంలోనైనా కనీసం పూర్తి హక్కులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– సాలాపు మారయ్య, పద్మనాభనగర్

దుర్గాపురం సమస్య పరిష్కరించాలి



దుర్గాపురం ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరించాలి. అధికారులు, నాయకులు వచ్చి చూసి వెళ్తున్నారే కానీ సమస్య తీరడం లేదు. ఇళ్ల పట్టాల సమస్యతో పాటు రహదారి సమస్య కూడా ఉంది. అటు రైల్వే, ఇటు పోర్టు, మరో వైపు నేవీ సంస్థల మధ్య నిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఎమ్మెల్యే గణబాబు చొరవ చూపి మా సమస్యపై అసెంబ్లీలో గళం విప్పి పరిష్కరించాలని కోరుతున్నాం.

– గుణేశ్వరరావు, దుర్గాపురం గ్రామ ప్రెసిడెంట్

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన డిప్యూటీ మేయర్ శ్రీధర్



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న శ్రీధర్

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మంగళవారం ఢిల్లీలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో చేస్తున్న కక్షపూరిత దాడులపై ఢిల్లీ నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనడానికి వెళ్లిన జగన్‌మోహన్‌రెడ్డిని ఎయిర్ పోర్టులోశ్రీధర్ కలిశారు. పలు అంశాలను ఆయన జగన్ మోహన్ రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లారు.

మర్యాదపూర్వక కలయిక



కమిషనర్ సంపత్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను మంగళవారం జీవీఎంసీ కార్యాలయంలో మంగళవారం బెహరా భాస్కరరావు కలిశారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛమందించారు. 91, 92 వార్డుల్లో పలు సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ఆయనతో పాటు 92వ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న రమణ తదితరులు

విశాఖ విద్య: ఎన్ఏడీ హైవే బస్టాప్ వద్ద మృతి చెందిన వ్యక్తికి ఎవరూ లేకపోవడంతో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అంత్యక్రియలు నిర్వహించారు. మృతి చెందిన వ్యక్తి వివరాలను పోలీసులు సేకరించగా ఎవరూ లేరని తేలింది. దీంతో విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రమణ, పోలీసుల కలిసి మంగళవారం బుచ్చిరాజుపాలెం శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసుకెళ్లి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ జోన్‌పోలీసు హెడ్‌కానిస్టేబుల్ లోవ రాజు, గోపి, పోతల సతీష్, రామకృష్ణ, నరసింహ, సత్యనారాయణ, బలిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కందిపప్పు నాణ్యత పరిశీలన



నరసింహనగర్ రైతుబజార్‌లో కందిపప్పు నాణ్యత పరిశీలిస్తున్న అధికారి ప్రవల్లిక

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు నాణ్యతను పౌరసరఫరాల శాఖ క్వాలిటీ చెకింగ్ ఆఫీసర్ పి.ప్రవల్లిక తనిఖీ చేశారు. విక్రయిస్తున్న సరుకుతో పాటు, ప్యాకింగ్‌లో ఉన్న కందిపప్పు, బియ్యం బస్తాలను పరిశీలించారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్. సత్యనారాయణ పాల్గొన్నారు.

రహదారిపై ఇనుప తుక్కు.. పొంచి ఉన్న ముప్పు

- కన్నెత్తి చూడని క్రైమ్,టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

మల్కాపురం : నలుగురు నడవాల్సిన సేవా మార్గం పాత ఇనుప తుక్కు దుకాణంలా మారిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించటం ఇబ్బందికరంగా తయారయింది. స్క్రాప్ దుకాణం నిర్వాహకుడి వల్ల ఇక్కడ పలువురు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా సేవా మార్గాన్ని స్క్రాప్ దుకాణంలా మార్చేసినా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. 58వ వార్డు గొందేశివానిపాలెం నుండి చిన్న ములగాడకు వెళ్లే దారిలో గల ఐఎన్ఎస్ ఏకశిల రక్షణ గోడకు ఆనుకుని ఈ స్క్రాప్ దుకాణం ఉంది. సుమారు అర కిలోమీటర్ మేర ఇనుము, ప్లాస్టిక్ స్క్రాప్‌ను ఇక్కడ డంప్ చేస్తున్నారు. ఈ సమస్య గత ఆరు నెలల నుండి ఉంది. ఈ మార్గం నుండి పిలకవానిపాలెం, గొందేశివానిపాలెం, ములగాడ, ఎదురువానిపాలెం తదితర ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సేవామార్గంలో స్క్రాప్‌ను డంప్ చేయటమే కాకుండా అక్కడ ఈ స్క్రాప్‌ను ఎల్‌పీజీ సిలిండర్ సాయంతో ముక్కలు చేయటం, ఆ స్క్రాప్ తుప్పును దులపటం వంటివి దుకాణ నిర్వాహకుడు చేస్తున్నాడు. నిజానికి స్క్రాప్ దుకాణం నిర్వాహించాలంటే విశాలమైన ప్రదేశంలో, జనావాసాలకు దూరంగా, అగ్నిమాపక పరికరాలతో ప్రమాద నివారణ చర్యలు తీసుకుని నిర్వహించాలి. కానీ ఇలాంటి జాగ్రతలు ఏమీ నిర్వాహకుడు తీసుకోవడంలేదు. నిబంధనల ప్రకారం సేవామార్గంలో స్క్రాప్‌ను డంప్ చేయకూడదు. అలా చేస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే స్క్రాప్ నిర్వాహకుడు తను సేకరించిన ఇనుప వస్తువులు ఎక్కడైనా అపహరించినివా, కోనుగోలు చేసినవా అనేది నిర్ధారించాల్సిన బాధ్యత క్రైమ్ పోలీసులపై ఉంది. అలాగే స్క్రాప్ దుకాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెక్క సామగ్రి వంటివి ఉంటాయి. వాటి ద్వారా అగ్నిప్రమాదాలు సంభవించకుండా నిర్వాహకుడు ఎలాంటి జాగ్రతలు తీసుకున్నాడన్న దానిపై అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించాలి. కానీ ఏ శాఖకు చెందిన అధికారులు కూడా ఎలాంటి తనిఖీలు ఇంత వరకు చేయకపోవడం ఆశ్చర్యకరం. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తన వెంట ఉన్నారన్న ధీమాతో నిర్వాహకుడు తన వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తున్నాడు. దీనిని ములగాడ, గొందేశివానిపాలెం గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ కమిషనర్‌ను, గాజువాక క్రైమ్ పోలీసులను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నారు.



ములగాడకు వెళ్లే సేవామార్గంపై డంప్ చేస్తున్న ఇనుప తుక్కు



ఐఎన్ఎస్ ఏకశిల రక్షణ గోడకు ఆనుకొని సేవా మార్గంపై డంప్ చేసిన స్క్రాప్

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సీపీఐ డిమాండ్

సింధియా: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 60 రోజులు కావస్తున్నా ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించ లేదని సీపీఐ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయులు, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు అన్నారు. మల్కాపురం గ్రామ మండలిలో మంగళవారం నియోజకవర్గ సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చినా ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రభుత్వ పథకాలు అందరికీ అందించాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వాన్ని నిలదీయడానికి సీపీఐ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నూనెల సూరిబాబు, పోతిన రాము, ఎస్‌వీ త్రినాథ్, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రావు, కామేశ్వరరావు, డి.తిరుపతిరావు, ప్రకాష్‌రెడ్డి, మహిళా సమైక్య నాయకురాలు గుడాల జయ, పార్వతి, పందిరి జయలక్ష్మి, పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యువకుడి అనుమానాస్పద మృతి



ప్రశాంత్ కుమార్(ఫైల్)

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం భరత్‌నగర్‌కు కింజరాపు ప్రశాంత్‌కుమార్ (20) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మధ్యాహ్నం 11 గంటల సమయంలో ఇంటికి సమీపంలో రోడ్డుపై ఉన్నాడని 1గంటకు ఇంటికి వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడని తండ్రి జగ్గారావు చెబుతున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, భోజనం కూడా చేయడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. శరీరం చల్లబడి ఉండడంతో కాపడం వంటి సపర్యలు చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలను ఆరా తీశారు. మృతుడికి తల్లి తండ్రి అక్క ఉన్నారు. తండ్రి జగ్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ఆక్రమణలో సంత స్థలం!



సంత స్థలంలో పార్కింగ్ చేసిన వాహనాలు

విశాఖ విద్య: గోపాలపట్నం ప్రభుత్వ ప్రాంతీయ పశు వైద్యశాలకు ఆనుకొని ఉన్న స్థలం ఆక్రమణలకు గురవుతోంది. ఇక్కడ కొన్నేళ్లుగా సంత నిర్వహిస్తున్నారు. సమీపాన అన్నా క్యాంటీన్ కూడా ఉండేది. దీని పక్కనే మురుగునీటి శుద్ధి కేంద్రం ఉంది. ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణ దారుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. అన్నా క్యాంటీన్ మళ్లీ ప్రారంభిస్తుండటంతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు సొంత వ్యాపారాల కోసం ఆక్రమణకు స్కెచ్ వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ స్థలం పరిరక్షణకు జీవీఎంసీ అధికారులు శ్రద్ధ తీసుకోకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. దీని పరిరక్షణకు జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

సింధియా: తూర్పు నావికాదళ పరిధిలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)కు పూర్వ వైభవం తీసుకురావాలని ఆ సంఘం సీనియర్ నాయకుడు, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి కిలపర్తి సత్యనారాయణ కోరారు. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి కార్మికులకు మరింత చేరువై బీఎంఎస్ అనుబంధ ఐఎన్‌సీఎంఎస్ (ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘ్) యూనియన్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేవల్ డాక్‌యార్డ్ విజయనగర్ గేటు వద్ద మంగళవారం జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా బీఎంఎస్ అనుబంధ ఐఎన్‌సీఎంఎస్ యూనియన్‌కు గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇందుకు తోడ్పాటును అందించిన కార్మికులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.దేముడు నాయుడు, అధ్యక్షుడు పి.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, కోశాధికారి పి.సురేష్, సీఈసీ మెంబర్ శ్రీనివాస్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు ఓలిరెడ్డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సనపాల రామకృష్ణ, రక్షణ రంగ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.



బీఎంఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఐఎన్‌సీఎంఎస్ సభ్యులు

ఉక్కు పరిరక్షణకు కేటాయింపులేవీ?

- బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌కు మొండిచెయ్యి
- స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1258వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

అగనంపూడి: ఎన్నికల ముందు విశాఖ ఉక్కు పరిరక్షణ మా వల్లే సాధ్యమని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం నేడు పరిరక్షణకు బడ్జెట్‌లో కనీస కేటాయింపులు చేయకపోవడం అన్యాయమని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1258వ రోజు, మంగళవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. రాజధాని అమరావతికి రూ.15వేల కోట్ల నిధులు కేటాయిస్తామని బడ్జెట్‌లో పొందుపర్చిన కేంద్రం విశాఖ ఉక్కు విషయంలో మాత్రం కనీసం కేటాయింపులు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఆర్థిక సహాయం అందించాలని మూడున్నర సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోపోవడం, తీరా ఎన్నికల్లో ప్రజలకు బీజేపీకి సముచిత స్థానం ఇచ్చినా కూడా మొండిచేయి చూపడం దుర్మార్గమన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ ఇదే తీరు కనపర్చారన్నారు. రాష్ట్రానికి అన్ని విధాలుగా నమ్మక ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలకు రాష్ట్రంపై ఎలాంటి అభిప్రాయం, ప్రేమాభిమానాలు ఉన్నాయో స్పష్టం అవుతోందన్నారు. కనీసం రెండు శాతం ఓట్లు కూడా లేని బీజేపీని పోటీ చేసిన దాదాపు అన్నిప్రాంతాల్లో గెలిపించిన రాష్ట్ర ప్రజలకు బీజేపీ చేసిన ద్రోహం అంతులేనిదన్నారు. దీక్ష శిబిరంలో నాయకులు కొమ్ము ప్రసాద్, పీవీబీవీ గోపాలరాజు, డి.ఆదినారాయణ, కె.సత్యనారాయణరావు, నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, జి.ప్రభాకర్ రెడ్డి, జి.గురుమూర్తి, మధు, వై.శ్రీను, ఆకుల నూకరాజు, దండు మోహన్, మద్ది అప్పలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

అక్కిరెడ్డిపాలెం: ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో కన్వీనర్ కోటా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించినట్లు బొల్లినేని మెడ్స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఇంటర్‌లో ఏ గ్రూపులో పాసైన విద్యార్థులైనా ఈ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



సీజనల్ వ్యాధుల గురించి వివరిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో డెంగ్యూ మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ వ్యాధులు ప్రబలడానికి కారణాలను విద్యార్థులకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వ్యాధి కారక దోమలు మంచినీటిలో పెరుగుతాయని వివరించారు. కుండీల్లో దోమ లార్వా పెరగకుండా డ్రమ్ములపై మూతలు పెట్టాలని .. వారంలో ఒక రోజు వాటిని శుభ్రం చేయాలని తెలిపారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా సోకినట్లు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మృదుల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్స్‌లు చెల్లించాలి



డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ మోహనరావుకు వినతి పత్రం అందిస్తున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు

మద్దిలపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న అలవెన్స్‌లను తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ మోహనరావును మంగళగిరిలో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ సానుకూలంగా స్పందించారని, త్వరలో బకాయిలు చెల్లించనున్నామని చెప్పారని రమణారెడ్డి తెలిపారు. డిపోల వారీగా బకాయి ఉన్న ఉద్యోగులకు వేతనంతో కలిపి చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిరాశ కలిగించిన బడ్జెట్

గోపాలపట్నం : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిర్మలా సీతారామన్ నిరాశే మిగిల్చారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోడదాశి సుధాకర్ అన్నారు. రాష్ట్రానికి ఇస్తామన్న రూ. 15 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తారా, లేక బ్యాంకుల ద్వారా అప్పుగా ఇస్తారా అన్న విషయంలో రాష్ట్ర ప్రజలకు అనుమానాలు ఉన్నాయన్నారు. కూటమిలో ఉన్న రాష్ట్ర ప్రయోజనాల గురించి ప్రభుత్వం కృషి చేయని విధంగా ఉందన్నారు. నిరుద్యోగ సమస్య, ఉపాధి అవకాశాల గురించి, నిరుపేద వర్గాలకు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. ఈ బడ్జెట్ రాష్ట్రానికి ఏ విధంగా ప్రయోజనం కలిగించే విధంగా లేదని అన్నారు.